ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
గురువారం 24 జూలై 2025

భూమికి బలం.. రైతుకు లాభం
- పచ్చిరొట్ట వైపు రైతుల చూపు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

6

## కలెక్టర్ ఆకస్మిక పర్యటన


చేర్యాల ఆస్పత్రిలో అటెండెన్స్ రిజిష్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

చేర్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హైమావతి చేర్యాలలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి, పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్, రైతు ఆగ్రోస్ సేవాకేంద్రం, తహసీల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది, వైద్యేతర సిబ్బంది హాజరు రిజిస్టర్, మెడిసిన్ స్టాక్, ఔట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లతో పాటు విధుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులతో కాసేపు మాట్లాడారు. పట్టణ శివారులో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు భూమిగారి పద్మావతి ఇంటి నిర్మాణ భూమిపూజలో పాల్గొని పనులు ప్రారంభించారు. రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి రెవెన్యూ సదస్సులద్వారా స్వీకరించిన దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. అనంతరం పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి విద్యార్థులెవరూ లేకపోవడంపై హెచ్ఎంను ప్రశ్నించారు. విద్యాసంస్థల బంద్ మేరకు విద్యార్థులు రాలేదని హెచ్ఎం నాగమణి వివరించారు. వంటగదిని పరిశీలించగా, మెనూలో లేని బగారా అన్నం, చికెన్ కర్రీ కనిపించడంతో అసహనం వ్యక్తంచేశారు. వండిన భోజనాన్ని వృథా చేయకుండా హాస్టల్ విద్యార్థులకు అందించాలని సూచించారు. చేర్యాల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ హైమావతితో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం పెండింగ్ పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఆమె వెంట చేర్యాల తహసీల్దార్ దిలీప్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ నాగేందర్ ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

## 'మహాలక్ష్మి' మహిళలకు వరం

హుస్నాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం ద్వారా కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఒక వరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం మహాలక్ష్మి పథకం ద్వారా 200 కోట్ల ఉచిత ప్రయాణాల మైలు రాయి దాటిన సందర్భంగా హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. 200 కోట్ల ఉచిత ప్రయాణం చేసి రూ. 6680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. మహాలక్ష్మి పథకంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు, మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డిపో మేనేజర్ వెంకన్న, వైస్ చైర్మన్ బంక చందు, చిత్తారి పద్మ తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తున్న కుక్కలు

# బౌబోయ్.. లెక్కలతోనే సరి!



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం రూప్లా తండాలో బిస్కెట్లు కొనడానికి ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా నాలుగేళ్ల బాలుడు నితిన్‌పై కుక్కలు దాడి చేశాయి. ఆ శునకాలు ఆ చిన్నారిని అత్యంత దారుణంగా కొరికికొరికి చంపాయి. ఈనెల 18వ తేదీన చోటుచేసుకున్న ఈ హృదయవిదారక ఘటనను మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది.

నాగల్‌గిద్ద మండలం గేమ్‌తండాకు చెందిన 11 ఏళ్ల జీవన్ కంగ్టి ఎస్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. హాస్టల్‌లో వారం రోజుల క్రితం బాలుడికి కుక్క కరిచింది. సిబ్బంది పట్టించుకోకపోడంతో పరిస్థితి విషమించింది. దీంతో బాలుడి తల్లిదండ్రులే కరస్‌గుత్తిలో ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం బీదర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈ రెండు చోట్లనే కాదు, ఉమ్మడి జిల్లాలో ప్రతీ వీధి.. ప్రతీ సందు.. బాబోయ్ ఎక్కడ చూసిన కుక్కలే.. గ్రామాల్లోనైతే మరీ విపరీతం. గుంపుగుంపులుగా తిరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయి. దాడులు చేస్తూ దడపుట్టిస్తున్నాయి. తాజాగా మెదక్ జిల్లాలో ఓ బాలుడు దుర్మరణం చెందడం కుక్కల దాష్టిక దాడికి పరాకాష్ఠ. గత ఏడు నెలల్లో ఉమ్మడి జిల్లాలో మూడు వేల మందికిపైగా కుక్క కాట్లకు గురై గాయపడ్డారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కుక్కల లెక్కలు తీశాం.. సర్వే చేశాం.. చర్యలు తీసుకుంటాం అనిచెబుతూ హామీలకే అధికారులు పరిమితమవుతున్నారు. కానీ, కుక్కల నియంత్రణ యాక్షన్ ప్లాన్ అమలుపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.


శివ్వంపేట మండలం రూప్లతండాలో కుక్కల దాడిలో చనిపోయిన నాలుగేళ్ల బాలుడు


దౌల్తాబాద్ మండలంలో కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి (ఫైల్)

- తాజాగా బాలుడి దుర్మరణంతో కలవరం
- ఏడు నెలల్లో 3 వేల మందికిపైగా గాయాలు
- గతంలో కుక్కల గణన చేసిన అధికార యంత్రాంగం
- అక్కడక్కడ మాత్రమే కుక్కలకు కు.ని. ఆపరేషన్లు
- నియంత్రణ చర్యలు లేకపోవడంతో ప్రజల భయాందోళన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 23 : సరిగ్గా పది నెలల క్రితం కుక్క కాట్లను అరికట్టడానికి అధికారులంతా ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేశారు. వాటికి ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ల ద్వారా పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించారు. హడావిడిగా కుక్కలను లెక్కించి ఆ తర్వాత చాలా చోట్ల చేతులెత్తేశారు. లెక్కలతోనే సరిపెట్టారే తప్ప ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అక్కడక్కడ మాత్రం కొన్ని కుక్కలకు శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత నిధుల లోపంతో వెనక్కు తగ్గారు.

**ఉమ్మడి జిల్లాలో కుక్కల లెక్క**

| జిల్లా | సంఖ్య | కుక్కకాట్లు |
|---|---|---|
| సంగారెడ్డి | 62,275 | 1,475 |
| మెదక్ | 17,636 | 2,213 |
| సిద్దిపేట | 47,568 | 1,119 |

### నియంత్రణ నిల్..

ఓ వైపు కుక్కలు స్వైర విహారం చేస్తూ అమాయకులను

మిగతా 7వ పేజీలో

# ముసురేసింది

- జిల్లాలో గరిష్టంగా 47.0 మి.మీ వర్షపాతం నమోదు
- మరో రెండు రోజులు వర్షాలు
- వాగులు, చెరువులకు జలకళ
- 24 గంటలు అందుబాటులో మాన్సూన్ టీం


నిండుకున్న ఎన్సాన్‌పల్లి చెరువు

సిద్దిపేట జూలై 23, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే వర్షం మొదలైంది. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని చెరువు నిండుకుండలా మారింది. మరో రెండు రోజులు వానలు కురిస్తే విస్తారంగా మత్తడి పోసే అవకాశముంది. నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో బుర్ర మణెమ్మ, బుర్ర కళావతికి చెందిన రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. బెజ్జంకి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మోయతుమ్మెద వాగుకు జలకళ సంతరించుకుంది. గాగిల్లాపూర్ మోయతుమ్మెద వాగులో నిర్మించిన చెక్‌డ్యాం నిండుకుండలా మరి మత్తడి దూకుతున్నది. పొలాలు నీటమునిగాయి. తొగుట, కొమురవెల్లి, చిన్నకోడూరు, హుస్నాబాద్, అక్కన్నపేట, రాయపోల్, గజ్వేల్ మండలాల్లోనూ వర్షం కురిసింది.




సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం వద్ద గుంతలో చేరిన వర్షపు నీరు

### వర్షపాతం ఇలా..

జిల్లావ్యాప్తంగా 47 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అక్బర్‌పేట భూంపల్లిలో గరిష్ఠంగా 47.0 మి.మీ, నారాయణరావుపేట 46.8, రాయపోల్ 44.3, సిద్దిపేట రూరల్ 43, చిన్నకోడూర్ 40.8,

మిగతా 8వ పేజీలో


మత్తడి దూకుతున్న నంగునూరు మండలం ఘనపూర్ చెక్‌డ్యాం


నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొందిలో కూలిన ఇళ్ల పైకప్పు

## ఎరువులు దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

- రైతులు ఆందోళన చెందొద్దు
- అందుబాటులో ఎరువులు
- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి

కుకునూరుపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో, కోళ్ల దుకాణాలు, రైస్‌మిల్లుల్లో బుధవారం జిల్లా అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల పోలీసులు ఫర్టిలైజర్ దుకాణాలను, డెయిరీ ఫారాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి కుకునూరుపల్లి మండల కేంద్రంలో పలు దుకాణాలను పరిశీలించి మాట్లాడారు. రైతులెవరూ ఆందోళన చెందొద్దని, తగినన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె సూచించారు. జిల్లాకు కేటాయింపుల వారీగా ఎరువులు వస్తాయని, దుకాణదారులు తప్పకుండా ఈపాస్ విధానంలోనే విక్రయించాలని, ఎప్పటికప్పుడు ఎరువుల నిలువలను సరిచేసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో అధిక ధరలకు విక్రయించవద్దని సూచించారు. మండలంలో రైతులకు అందుబాటులో 75 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నదని తెలిపారు. అనంతరం మెదినీపూర్ శివారులో గల డెయిరీ ఫారాలను తనిఖీ చేశారు. పశువులకు మంచి నాణ్యమైన దాణా, మేతను అందజేయాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. ఆమె వెంట ఏవో గోవిందరాజు, ఎస్సై శ్రీనివాస్ మరియు సిబ్బంది ఉన్నారు.


కుకునూరుపల్లిలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో స్వరూపరాణి

### యూరియా దాస్తే కఠిన చర్యలు

సిద్దిపేట అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూరియాను అక్రమంగా దాచిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పరిధిలో కొండపాక మండల పరిధిలోని అశోక్ లేలాండ్ సర్వీసింగ్ సెంటర్, పటేల్ డెయిరీ ఫార్మ్, కొండపాక మండల పరిధిలో ఫర్టిలైజర్ షాప్‌లో వ్యవసాయశాఖ అధికారులు శ్రీనాథ్, శివరామకృష్ణ, వన్ టౌన్ సీఐ వాసుదేవరావుతో కలిసి సోదాలను నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకే కొన్ని ప్రదేశాలలో సోదాలు నిర్వహించామని తెలిపారు. కానీ అక్కడ ఎటువంటి ఆధారాలు లభించలేదని పూర్తి సమాచారం తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.


ఏకగ్రీవంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌ను సన్మానిస్తున్న పలుగుగడ్డ గ్రామస్థులు

## సర్పంచ్.. ఉప సర్పంచ్ ఏకగ్రీవం

- ఎన్నికలకు ముందే ప్రకటన

జగదేవ్‌పూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయక ముందే గ్రామాలలో ఎన్నికల సందడి నెలకొంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పలుగుగడ్డ గ్రామస్థులు పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి గ్రామ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో గత ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి ఒక ఓటుతో ఓడిపోయిన నర్ర కనకయ్యను సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా నర్రా రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు గ్రామస్థులు ప్రకటించారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే సర్పంచ్, ఉపసర్పంచ్‌గా పలుగుగడ్డ గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే, ఇందులో సర్పంచ్ అభ్యర్థి గ్రామంలో గుడి కట్టుకునేందుకు తన సొంత స్థలాన్ని ఇస్తానని గ్రామ పెద్దలకు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారు ఏకగ్రీవ ప్రకటన చేసినట్లు తెలిసింది.

## కాలువలను కబళిస్తున్న మట్టి దొంగలు

- మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాలువలను గుల్ల చేస్తున్న అక్రమార్కులు
- గజ్వేల్ డివిజన్‌లో నిరాటంకంగా మట్టి తరలింపు రూ.కోట్లకు పడగలెత్తుతున్న వ్యాపారులు
- నిద్రపోతున్న అధికార యంత్రాంగం!


గజ్వేల్-కుకునూరుపల్లి మండలాల సరిహద్దులోని మల్లన్నసాగర్ కాలువ నుంచి మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్

గజ్వేల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాలువల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా భారీ ఎత్తున మట్టిని తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. గజ్వేల్, కుకునూరుపల్లి, మర్కూక్, ములుగు, వర్గల్ మండలాల్లో ఈ అక్రమ దందా నిరాటంకంగా కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారన్నారు.

గజ్వేల్, కుకునూరుపల్లి మండలాల సరిహద్దులోని మల్లన్నసాగర్ ప్రధాన కాలువ నుండి ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల సహాయంతో నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. గతంలో ముద్దాపూర్ చెరువు నుంచి మట్టిని తరలించిన అక్రమార్కులు, ఇప్పుడు కాలువలను లక్ష్యంగా చేసుకున్నారు. రైల్వే పనులకో, రింగ్‌రోడ్డు పనులకో మట్టి తరలిస్తున్నామని చెబుతూ, బయట మార్కెట్‌లో ఒక్కో ట్రిపు మట్టిని రూ.3వేల నుంచి రూ.4వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు ఈ మట్టిని తరలిస్తూ అధికారులకు ఎంతో కొంత ముట్టచెబుతూ తమ దందాను నిరాటంకంగా సాగిస్తున్నారు. మట్టి దందా గురించి అధికారులకు తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

### ములుగు, వర్గల్ మండలాల్లో..

గజ్వేల్ డివిజన్ పరిధిలోని ములుగు, వర్గల్, మర్కూక్ మండలాల్లో మట్టి వ్యాపారం రూ.కోట్లలో నడుస్తోంది. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉండడంతో ఇక్కడ మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా అక్రమార్కులు అందినకాడికి దండుకుంటున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ అసైన్డ్ భూములు, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం సేకరించిన భూముల నుంచి మట్టిని తరలిస్తూ కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఎర్రమట్టి దొరికిందంటే పండగ చేసుకున్నట్లే భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో ట్రిప్పు ఎర్రమట్టికి కనీసం రూ. 10వేల నుంచి రూ. 15 వేల వరకు లభిస్తుండడంతో అక్రమార్కులు మరింత ఆసక్తి చూపుతున్నారు. మర్కూక్ మండలం పలు చెరువులు మట్టి తరలింపు వల్ల పూర్తిగా పెద్ద పెద్ద గుంతలుగా మారిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల శాఖ అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంప్రదించి మట్టి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## విస్తరణ.. విస్మరణ

- ఇళ్లు కూల్చి ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని వైనం
- సరైన దారులు లేక చాకలివాడ ప్రజలకు తిప్పలు
- మురుగు, గడ్డిలోనే జీవనం
- నిధులు లేవంటూ చేతులెత్తేసిన అధికారులు

7

# భూమికి బలం.. రైతుకు లాభం

● పచ్చిరొట్ట వైపు రైతుల చూపు

● అవగాహన కల్పిస్తున్న అధికారులు


నిజాంపేటలో ఏపుగా పెరిగిన జీలుగ

నిజాంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట.. భూమికి అవసరమైన పోషకాలు అందించడంలో రసాయన ఎరువులకంటే మేలైనదిగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తక్కువ ఖర్చుతో.. పంటలపై రసాయన ఎరువుల ప్రభావం తక్కువ ఉండాలంటే పచ్చిరొట్ట సాగు తప్పని సరి అంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రైతులు పచ్చిరొట్ట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

### సేంద్రియ ఎరువుల కొరత

నేటి వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. సేంద్రియ ఎరువులు దొరకడం కష్టంగా మారింది. పాతకాలంలో వరి సాగుకు పశువుల, కోళ్ల ఎరువును వినియోగించేవారు. ప్రస్తుతం ఇళ్లలో పాడిపశువులు కనిపించడం లేదు. అయినా, కొందరు రైతులు కోళ్ల, గొర్రెల, ఇతర పశువుల ఎరువులపై ఆధారపడుతున్నారు. అయితే, వీటి ధరలు పెరిగిపోయాయి. కోళ్ల ఎరువు ట్రాక్టర్ రూ. 5 వేలు పలుకుతోంది. పశువుల ఎరువు కోసం రూ. 6 వేలు వెచ్చించాల్సి వస్తోంది. ఇక పొలంలో ఒక రోజు గొర్రెల మంద నిలిపితే రూ. 1,500 వరకు చెల్లించాల్సి వస్తోంది. వీటిన్నింటినీ భరించేందుకు రైతులు ముందుకు వచ్చినా ఈ ఎరువులు దొరకకడం కష్టంగా మారింది.

### పచ్చిరొట్టతో భూసారం పెంపు..

తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ లాభం చేకూర్చే పచ్చిరొట్ట వైపు రైతులు దృష్టి సారించగా, ఇందులో భాగంగా జనుము, జీలుగా, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వీటి విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తోంది. దీంతో తొలకరి వర్షాలు పడగానే జూన్ మొదటి వారంలో పచ్చిరొట్ట విత్తనాలు వేసిన రైతులు ప్రస్తుతం పూత దశకు వచ్చిన జనుము, జీలుగను పొలంలోనే దున్నేస్తున్నారు. ఇలా చేసిన తర్వాత ఎకరాకు 25 కేజీల చొప్పున సింగిల్ సూపర్ పాస్పెట్ వేస్తే ఇది నీటిలో కలిసి పోతుంది. ఇలా సాగు చేస్తే ఎకరాకు 8 నుంచి 9 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. దీంతో భూసారం పెరిగి ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం అందుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

### కొన్నేళ్లుగా సాగు చేస్తున్నా..



నాకున్న రెండు ఎకరాల పొలంలో ప్రతి సంవత్సరం జీలుగ విత్తనాలు వేసి పూతదశకు చేరుకోగానే పొలంలో కలియ దున్ని మురగబెడుతున్నా.. దానివల్ల ఎరువుల వాడకం తగ్గి పంట దిగుబడి పెరుగుతోంది.

**-మావురం అంజయ్య, రైతు నిజాంపేట**

### పెట్టుబడి తగ్గుతుంది..



పచ్చిరొట్ట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుంది. ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచింది. సేంద్రియ ఎరువుల వల్ల పెట్టుబడి తగ్గడంతో పాటు, అధిక దిగుబడి వస్తుంది. నేల సారం కూడా పెరిగి, పర్యావరణానికి మేలు జరుగుతుంది.

**-సోమలింగారెడ్డి, మండల వ్యవసాయ అధికారి, నిజాంపేట**

## టీచర్ల సర్దుబాటులో లోపాలున్నాయ్ !

● సవరించాలని డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు జాబితాలో లోపాలున్నాయని, నిబంధనలు పాటించలేదని పలు ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో సర్దుబాటులో జరిగిన పొరపాట్లను సంఘ నాయకులు డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్ర స్థాయిలో ఎంఈవోలు తప్పుడు సమాచారం ఇవ్వడంతో కొందరు ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వివరించారు. మహిళలు, దివ్యాంగులైన ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా కనీసం రవాణా సౌకర్యం లేని పాఠశాలలకు సర్దుబాటు చేశారని సంఘ నాయకులు డీఈవో దృష్టి తీసుకొచ్చారు. అంతే కాకుండా సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా వారి సుముఖత తీసుకోకుండా సర్దుబాటులో బలవంతంగా స్థానచలనం కలిగించారన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల సంఖ్య ఎక్కువ చూపి కొందరు ఉపాధ్యాయులను స్థాన చలనం చేయకుండా కొన్ని మండలాల ఎంఈవోలు అనుకూలంగా వ్యవహరించారన్నారు. సానుకూలంగా విన్న డీఈవో అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా సమర్పించాలని పరిశీలించి, కలెక్టర్ అనుమతి తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ఉపాధ్యాయల సంఘాల నేతలు తెలిపారు.

## వ్యక్తి అనుమానస్పద మృతి

కొండాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మారేపల్లి శివారులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు.. దొబ్బకుంట గ్రామానికి చెందిన సురేష్ (30) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. బుధవారం సాయంత్రం మారేపల్లి శివారులో అనామానాస్పద స్థితిలో సురేష్ తలకు బలమైన గాయంతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని డాగ్ స్కాడ్‌తో పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతుడిని బలమైన రాయితో కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.


నాట్య ప్రదర్శనల్లో సాధించిన కప్పులు, అవార్డులతో నివేదిత



# నృత్య నివేదిత

● కూచిపూడిలో రాణిస్తున్న బాలిక

● చిన్న వయస్సులోనే ప్రశంసల వెల్లువ

● అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రదర్శనలు

కంగ్టి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పిట్ట కొంచెం... కూత ఘనం అన్న చందంగా నృత్యం పట్ల తనకున్న మక్కువతో పిన్న వయస్సులోనే కూచిపూడి నృత్యంతో పాటు ఏకపాత్రాభినయంలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతోంది సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంగ్టికి చెందిన 12 ఏళ్ల వడ్ల నివేదిత. మారుమూల ప్రాంతమైన కంగ్టి గ్రామానికి చెందిన వడ్ల దత్తాత్రి, లత దంపతుల కుమార్తె వడ్ల నివేదితకు చిన్నప్పటి నుంచే కూచిపూడి నాట్యంపై ఎనలేని ఆసక్తి. తండ్రి వృత్తిరీత్యా రైల్వే ఉద్యోగి కావడంతో కూతురికి కూచిపూడిపై ఉన్న ఆసక్తిని గుర్తించి నాలుగవ ఏటనే హైదరాబాద్‌లోని భారత వేదా ఆర్ట్స్ అకాడమీలో చేర్పించారు. గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తూనే గురువు శ్రీనివాస్ వరప్రసాద్ వద్ద కూచిపూడి నాట్యంలో మెలకువలు నేర్చుకుంది. కేవలం కూచిపూడి నాట్యమే కాకుండా ఏకపాత్రాభినయంలోనూ ఆమె దిట్ట. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న నివేదిత ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకోవడం విశేషం. కరోనా కాలంలో 2020లో ఆన్‌లైన్ ద్వారా తానా నిర్వహించిన తెలుగు సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్న నివేదిత రాణీ రుద్రమదేవి ఏకపాత్రాభినయంతో మొదటి బహుమతి సాధించింది.

### అవార్డులతో పాటు ప్రశంసలు

కూచిపూడి నాట్యంతో పాటు ఏకపాత్రాభినయంలో రాణిస్తున్న నివేదిత స్థానికంగానే కాకుండా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ రాణిస్తోంది. భారత రంగస్థల అకాడమీ, అఖిల నటరాజన అంతర సాంస్కృతిక సత్సంగ్, భారతీయ నృత్య కళా సమ్మేళన్, సంస్కార భారతి, రాష్ట్రీయ కళా మహోత్సవ్ వంటి అకాడమీలు నిర్వహించిన పోటీల్లో పాల్గొని నివేదిత సత్తా చాటింది. 2019లో కళా రూప్ రత్న, 2020లో అంతర్జాతీయ స్థాయిలో మోనే యాక్టర్లో విజేత. 2021లో కళాకుసుమం, 2022లో ప్రౌడ్ ఐకాన్, 2023లో ఐసీఎండీఏ నుంచి ప్రపంచ రికార్డు, 2024లో మహానంది జాతీయ పురస్కారం, బాల కళా శ్రీ నృత్య పురస్కారం వంటి అనేక అవార్డులను నివేదిత కైవసం చేసుకుంది. చదువు పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా వేకువనే లేచి గంట పాటు సాధన చేసిన అనంతరం విద్యాలయానికి వెళ్తుంది. మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కూచిపూడి నృత్య శిక్షణకు వెళుతూ నాట్యంపై మంచి పట్టు సాధిస్తుంది నివేదిత.

### అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలే లక్ష్యం

అమ్మ, నాన్నల ప్రోత్సాహంతోనే నేను కూచిపూడి నృత్యంలో రాణించగలుగుతున్నాను. మారుమూల ప్రాంతంలో పుట్టిన నేను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే కూచిపూడి నృత్య పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చి, సత్తా చాటాలనే ఆశయంతోనే అనునిత్యం సాధన చేస్తున్నాను.

**-నివేదిత**





## ప్రొఫెసర్ల నియామకం


డా.ఆనంద్

సంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పలువురు అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్‌గా పదోన్నతిపై నియామకమయ్యారు. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలోని కార్డియాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.కె.జగదీశ్‌రెడ్డి ప్రొఫెసర్‌గా పదోన్నతిపై సంగారెడ్డి మెడికల్ కాలేజీకి నియమితులయ్యారు. సంగారెడ్డి జీఎంసీలో న్యూరాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.అర్చన ప్రొఫెసర్ పదోన్నతిపై సంగారెడ్డి జీఎంసీలోనే నియమితులయ్యారు. మంచిర్యాల మెడికల్ కాలేజీలో న్యూరో సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.ప్రతాప్‌కుమార్ పదోన్నతిపై సంగారెడ్డి జీఎంసీకి రానున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బలిరామ్ చిక్టె ప్రొఫెసర్ పదోన్నతిపై సంగారెడ్డి జీఎంసీకి నియమితులయ్యారు. నెఫ్రాలజీ విభాగం నుంచి డాక్టర్ బి.విక్రమ్‌కుమార్ పదోన్నతిపై సంగారెడ్డికి రానున్నారు. ఇక హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి యూరాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.ఆనంద్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై సంగారెడ్డి జీఎంసీకి నియమితులయ్యారు.

## ఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమా హారతి



నారాయణఖేడ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్‌గా 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఉమాహారతిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్‌గా ఆవిర్భవించిన తర్వాత ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తిని హైదరాబాద్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది.

## హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

● ఆమె కుమారుడిపై పోక్సో కేసు నమోదు

నారాయణఖేడ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లోని బీసీ వసతిగృహంలో జరిగిన ఘటనలో హాస్టల్ వార్డెన్ శారదను సస్పెండ్ చేశారు. ఆమె కుమారుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ వెల్లడించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ఘటనలో బాధ్యులైన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్‌లోని బీసీ వసతి గృహంలోని వార్డన్ కుమారుడు వసతి గృహంలోని బాలికలను వేధిస్తుండటంతో ఆ విద్యార్థినులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతోకలెక్టర్ ఆదేశాలతో పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారి పై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా వసతి గృహంలోని అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

మద్దూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారు. విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి మోడల్‌స్కూల్‌ను బుధవారం సందర్శించారు. స్కూల్‌తోపాటు కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ అందె గణేష్‌తోపాటు మరో ఇద్దరు టీచర్లు మన్మథ, ప్రమోదలను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ తన సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా ఈ పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్, పది ల్యాప్‌టాప్‌లను అందించింది. వీటి నిర్వహణ సరిగ్గా లేదన్న కారణంగా ప్రిన్సిపాల్, టీచర్లను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

### క్రైం కార్నర్

## కారును ఢీకొట్టిన లారీ.. పట్టుకోబోతే ప్రాణమే పోయింది

●అదే లారీ ఢీకొని వ్యక్తి మృతి


సత్తిరెడ్డి(ఫైల్)

చేగుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగ్ మండలం వల్లూరు 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. నార్సింగ్ ఎస్ఐ సృజన తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన గల్వ సత్తిరెడ్డి (45) హైదరాబాదులో పెట్రోల్ పంపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సత్తిరెడ్డి దివ్యాంగుడు. సోదరులు రాంరెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటరెడ్డిలతో కలిసి కామారెడ్డి జిల్లా తిప్పాపూర్‌లో అమ్మమ్మ వాళ్ల బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. నార్సింగ్ మండలం మల్లూరు నర్సరీ వద్ద హైదరాబాద్ వెళుతున్న వీరు ప్రయాణిస్తున్న ఆల్టో కారును లారీ పక్కనుంచి ఢీకొనడంతో కారు కొంతమేరకు డ్యామేజ్ అయ్యింది. ఈ నేపథ్యంలో లారీని పట్టుకోవాలన్న ఉద్దేశంతో వారు లారీని ఓవర్ టేక్ చేసి వల్లూరు శివారులో లారీని ఆపుతుండగా అదే లారీ సత్తిరెడ్డిని ఢీకొనడంతో కిందపడ్డాడు. అతడి తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లత, కూతురు యషిక ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## బ్రిడ్జి వద్ద లారీ బోల్తా



చేగుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం రాంపూర్ గ్రామ శివారులో దౌల్తాబాద్ వెళ్లే రహదారి వద్ద అదుపుతప్పి కంటైనర్ లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి చేగుంట మండలం రాంపూర్ మీదుగా సిద్దిపేట జిల్లా మిట్టపల్లిలోని ఒక పరిశ్రమకు కెమికల్ పౌడర్ తీసుకెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి రాంపూర్ గ్రామ శివారులోని కల్వర్టు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, కంటైనర్‌లో తీసుకెళ్తున్న కెమికల్ పౌడర్ లోడు నీటిలో కలవడంతో భారీగా పొగలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి రోడ్డు నిర్మాణం పనులు పూర్తయినా కల్వర్టు పూర్తి కాకపోవడమే కారణమని, రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ మధ్యలో కల్వర్టు పనులు పూర్తి చేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపించారు.

## 500 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

● స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



మునిపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 500 గ్రాముల ఎండు గంజాయిని మునిపల్లి పోలీసులు బుధవారం కంకోల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఈ వివరాలను మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్‌లోని ఇరానీ గల్లి నుంచి హైదరాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో ఎస్సై రాజేష్ నాయక్ తన సిబ్బందితో కలిసి కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఒక స్కూటీపై అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేయగా, అందులో 500 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మోజాల ఈశ్వర్, సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని కవేలి గ్రామానికి చెందిన బోయిని నిఖిల్.. బీదర్‌లోని ఇరానీ గల్లిలో ఒక వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు గంజాయి సరఫరాకు ఉపయోగించిన స్కూటీ, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## బాలికను పనిలో పెట్టుకున్నందుకు కేసు

నర్సాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాలికను పనిలో పెట్టుకున్నందుకు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణం యాజమానిపై కేసు నమోదు చేశారు. పట్టణంలో బుధవారం అసిస్టెంట్ లేబర్ అధికారి అబ్దుల్ జుబేర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బస్టాండ్ సమీపంలోని ఓ వస్త్ర దుకాణంలో బాలికతో పని చేయిస్తున్నట్లు గుర్తించారు. సదరు దుకాణ యాజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ అధికారి అబ్దుల్ జుబేర్ మాట్లాడుతూ మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అన్నారు.

## ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

బెజ్జంకి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవక్కపల్లి శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని (అశోక్ లెలాండ్) బుధవారం ఎస్ఐ సౌజన్య పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించిన, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## సింగూరు నీటిని విడుదల చేయండి

● మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

పాపన్నపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టుకు సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డికి బుధవారం వినతి పత్రం ఇచ్చినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమై సుమారు 53 రోజులు కావస్తున్నా, ఇంత వరకు మెదక్ జిల్లాలో ఆశించిన వర్షాలు కురువలేదన్నారు. దీంతో ఘనపురం ఆయకట్టు రైతాంగం వేసిన వరి తుకాలు ముదిరి పోతున్నాయని చెప్పారు. సింగూరు ప్రాజెక్టు నుండి ఘనపురానికి వాటాగా రావాల్సిన 4.06 టీఎంసీల నీటిపై ఇక్కడి రైతాంగానికి పూర్తి హక్కు ఉందన్నారు. యేటా 12 నుంచి 13 విడతలుగా నీరు విడవాల్సి ఉందన్నారు. సింగూరులో 18.6 టీఎంసీలకు పైగా నీరు ఉన్నందున, వెంటనే 0.5 టీఎంసీ నీటిని విడుదల చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

### రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌కు..

సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టునకు సింగూరు నీటిని విడుదలచేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసినట్లు మెదక్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఘనపురం ఆనకట్ట కింద ఉన్న రైతాంగం వరి తుకాలు వేసి, నీరు లేక నాట్లు వేయలేని పరిస్థితిలో ఉందన్నారు. నీరు వదలక పోతే, రైతులు ఆందోళన చేసే అవకాశం ఉందన్నారు. ఇంతకు ముందే మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సైతం మంత్రిని కలిసి సింగూరు నీటిని విడుదల చేయాలని కోరారన్నారు.



గల్లీ విస్తరణతో కూలిన ఇళ్లలో పెరిగిన గడ్డి

### నడవలేకపోతున్నాం



గల్లీ పెద్దదవుతుందనుకుని ఇళ్లను కూల్చుకున్నాం. ఎక్కడి మోరీలు అక్కడే, ఎక్కడి బురద అక్కడే ఉన్నది. సరిగ్గా నలభై ఏళ్ల క్రితం మా గల్లీలో శాబాష్ బండల రోడ్డు ఉండేది. గల్లీ చిన్నగున్నా, దుబ్బాకలో మా దగ్గరనే బండలతో రోడ్డు వేశారు. ఆ తరువాత 30 ఏళ్లుగా పగిలి పోయిన, ఇరుకైన సందులో నడిచాం. ఐనా అప్పుడు నరకం అనిపించలేదు. కానీ ఇప్పుడు బతకడం కష్టంగా మారింది. రోగాల బారిన పడుతున్నాం. మురికి వాసన, దోమలతో తల్లడిల్లుతున్నాం

-అసం సరోజన, స్థానికురాలు

### అడవిలో ఉన్నట్లు ఉంది



మా బతుకు ఊర్లో ఉన్నట్టుగా లేదు. ఇళ్లన్నీ కూల్చుకున్నాక, గడ్డితో మా గల్లీ నిండింది. మున్సిపల్ అధికారులు కనీసం గడ్డి కూడా తొలగించడం లేదు. దీంతో పాములు, పురుగులు, దోమలు వస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనికరం లేదు. మురికి కాలువలు, రోడ్డు చదును చేసింది లేదు. మేము కూడా ఇంటి పన్ను కడుతున్నాం. మా మీద దయ ఉంచాలి. మా గల్లీని మంచిగా చేయాలి.

-కారంకంటి రేఖ, స్థానికురాలు

# విస్తరణ..విస్మరణ

**ఇళ్లు కూల్చి ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని వైనం**

- సరైన దారులు లేక నరకం అనుభవిస్తున్న చాకలివాడ ప్రజలు
- మురుగు , గడ్డిలోనే జీవనం
- పాములు, చీడపురుగుల సంచారం
- నిధులు లేవంటూ చేతులెత్తేసిన అధికారులు

దుబ్బాక, జూలై 23(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలోని చాకలివాడగా పిలువబడే 17వ వార్డు సమస్య తరతరాల నుంచి ప్రజలను వేధిస్తోంది. మనిషి చనిపోతే పాడేపట్టేంత దారి కూడా లేని ఈ గల్లీలో రెండేళ్ల క్రితం విస్తరణ పేరుతో ఇళ్లన్నీ కూల్చేశారు. తమకు ఆపదొస్తే కనీసం 108 వాహనం వచ్చేంత దారి ఉంటే బాగుంటుందని భావించిన గల్లీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇళ్లను కూల్చివేతకు అంగీకరించారు. అయితే, ఆ తర్వాత వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది.

**నిధులు లేవని..**

కూల్చిన ఇళ్లు కూల్చినట్టుగానే ఉండగా, కొంత మంది డబుల్ బెడ్రూం ఇళ్లలో తాత్కాలిక ఆశ్రయం పొందుతున్నారు. రహదారి విస్తరణకు నిధులు లేవని మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. విస్తరణకు ముందు టీయూఎఫ్ఐడీసీ కింద దుబ్బాక మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు మంజూరయ్యాయి. అదే నిధుల నుంచి సుమారు రూ. 25 లక్షల వరకు రహదారి విస్తరణ కోసం కేటాయించారు. అయితే, ప్రభుత్వం, విధానాలు మారడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. తిరిగి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాల్సిందిగా గత 15 రోజుల క్రితం కూడా సూచించింది. ఆ పదిహేను కోట్ల ప్రతిపాదనలో తమ వార్డుకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



దారికి అడ్డంగా మురుగు కాలువలు, గడ్డి

## పీఏసీఎస్‌కు కాంప్లెక్స్ ఎరువుల సరఫరా

- 800 బస్తాల 20-020, 300 బస్తాల యూరియా స్టాక్



కంది పీఏసీఎస్‌లో దిగుమతి అవుతున్న కాంప్లెక్స్ ఎరువులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కందిలోని పీఏసీఎస్‌లో కాంప్లెక్స్ ఎరువుల కొరతపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పీఏసీఎస్‌లో కాంప్లెక్స్ ఎరువుల కొరత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా వ్యవసాయ అధికారులు స్పందిచారు. వెంటనే పీఏసీఎస్‌కు కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు బుధవారం రెండు లారీలలో 800 బస్తాల 20-20 కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేశారు. గతంలో గ్రోమోర్ కంపెనీకి చెందిన 20-20 కాంప్లెక్స్ ఎరువు 50కేజీల బస్తాకు రూ.1300 ఉన్నది. ఇప్పుడు గుజరాత్ రాష్ట్రం నుంచి చంబల్ కంపెనీ తయారుచేసిన 20-20 ఎన్‌పీకే కాంప్లెక్స్ దిగుమతి అయ్యింది. దీని ధర బస్తాకు రూ.100 అదనంగా ఉంది. పీఏసీఎస్‌లో రూ.1400లకు ఒక బస్తా 20-20ని విక్రయిస్తున్నారు. దీంతో రైతులకు 50 కేజీ బస్తాకు మరో వంద రూపాయలు అదనంగా భారమయ్యింది. ప్రస్తుతానికి కంది పీఏసీఎస్‌లో 800 బస్తాల 20-20, 300 బస్తాలుల యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ దొడ్ల ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే మరో ఉద్యమం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

సంగారెడ్డి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీసీల 42 శాతం రిజర్వేషన్లను రాజకీయ కక్షతో ఎవరు కూడా అడ్డుకోవద్దని, అడ్డుకుంటే మరో ఉద్యమానికి నాంది పలుకుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వినియోగించుకుని కీలుబొమ్మల్లాగా ఆడించాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిందని గుర్తు చేశారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి బీసీ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీని సీఎంగా చేస్తామని ప్రకటించిన బీజేపీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించి నిజాయితీని నిలుపుకోవాలన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ ఆగస్టు 7న గోవాలో నిర్వహిస్తున్నామని ఆ కార్యక్రమానికి పలు రాష్ట్రాల సీఎంలు, ప్రముఖులను ఆహ్వానించినట్టు తెలిపారు. సమావేశంలో ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, బీసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జగదీష్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగండి

- గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సూచన



పటాన్‌చెరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలోని అత్యుత్తమ వనరులన్నింటినీ సద్వినియోగం చేసుకుని పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగాలని గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా తొలి ఏడాది విద్యార్థులకు ఉద్బోధించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తొలి ఏడాది విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. గీతంలో తరగతి గది లోపల, వెలుపల జ్ఞానం యొక్క విస్తృత, సమగ్ర దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. వ్యక్తిత్వ నిర్మాణం, సదుద్దేశ భావాన్ని పెంపొందించుకోవడం, పాఠ్యేతర కార్యకలాపాలలో విద్యావేత్తలను సమతుల్యం చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు విశ్వవిద్యాలయ విద్యా నైపుణ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రామశాస్త్రి, వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులను విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ ఇండక్షన్ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ పి. త్రినాథరావు సమన్వయం చేశారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతా రెడ్డి, గీతం పూర్వ విద్యార్థులు కొత్త బ్యాచ్ విద్యార్థులతో సంభాషించి, తగిన మార్గదర్శనం చేశారు.

## మహిళల అభ్యున్నతికి కృషి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- మెదక్ ఆర్టీసీ బస్ డిపోలో సంబరాలు

మెదక్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి కొనసాగిస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మెదక్ ఆర్టీసీ డిపోలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహలక్ష్మి పథకం కింద గడిచిన 20 నెలల కాలంలో జిల్లాలో 2.72 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయడంతో రూ.81.04 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరగడంతో జిల్లా పరిధిలో కొత్తగా 8 బస్సులను కొనుగోలు చేసినట్లు చెప్పారు. విశేష సేవలందిస్తూ.. పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ సంస్థ ద్వారా ఆయా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా ప్రయాణికులను, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు. డీఎం సురేఖ తదితరులు పాల్గొన్నారు.

**భూసార పరీక్షలు రైతులకు రక్ష**

హవేళిఘనపూర్ : మండలంలోని కూచన్‌పల్లి రైతు వేదికలో లారస్ ల్యాబ్ చారిటబుల్ ట్రస్ట్, ఇక్రిసాట్‌ల ఆధ్వర్యంలో భూసార పరీక్షల వాహనంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ భూసార పరీక్షలు రైతులకు రక్షగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి దేవకుమార్, ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు పుష్పజిత్ చౌదరి, విజయ్ రంగనాథ్, ఏవో బాల్‌రెడ్డి, ఏఈవో ప్రశాంత్, ఎంఈవో మధుమోహన్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**అర్హులందరికీ రేషన్ కార్డులు**

పెద్దశంకరంపేట: అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లాలో 9,961 కొత్త రేషన్ కార్డులతో 34 వేల కుటుంబాలకు అదనంగా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, పేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో షాకీర్‌అలీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధు, నాయకులు నారాగౌడ్, ఆర్ఎన్. సంతోష్‌కుమార్, దాచ సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, సుభాష్ గౌడ్, కుంట్ల రాములు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రపప్పుతో ఆజాద్ చిత్రం




గజ్వేల్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు ఎర్రపప్పును ఉపయోగించి ఆజాద్ చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ యువతకు స్ఫూర్తి అని అన్నారు.

## స్థానిక సంస్థల పనితీరు ఎలా ఉంటుంది

- కొండాపూర్ త్రిపుర బృందం పర్యటన



తొగర్‌పల్లిలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న త్రిపుర ప్రజాప్రతినిధులు

కొండాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయితీ కార్యాలయాల నిర్వహణ ఉపాధి హామీ పనుల తీరును త్రిపుర జిల్లా పరిషత్ చైర్మన్, సభ్యుల బృందం పరిశీలించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ రాజేంద్రనగర్ సంస్థలో శిక్షణకు వచ్చిన త్రిపుర జిల్లా పరిషత్ ప్రతినిధులు బుధవారం కొండాపూర్ మండలాన్ని సందర్శించారు. అలీయాబాద్ ప్రకృతి వనం, నర్సరీలో మొక్కల పెంపకం, చెత్త సేకరణతో ఎరువుల తయారీని పరిశీలించారు. తొగర్‌పల్లిలో గ్రామ పంచాయతీ పనితీరు, పంచాయతీ రాజ్ చట్టంపై ప్రజలకున్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్‌లో ఎంపీడీవో సత్తయ్య స్థానిక సంస్థల విధివిధానాలు, ఉపాధి, మహిళ సంఘాల అభివృద్ధి, రాష్ట్రంలో జరుగుతున్న వివిధ సంక్షేమ పథకాలను బృందానికి వివరించారు. అంతకు ముందు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డిప్యూటీ సీఈవో స్వప్న త్రిపుర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో ఎంపీడీవో సత్తయ్య ఏపీవో వీరప్ప, జీపీ కార్యదర్శులు నర్సమ్మ, అరుణ, ఈసీ గణపతి, టీఏ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నాకు సమాచారం కూడా ఇవ్వరా ?

- వసతిగృహాల సలహా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి అసంతృప్తి



వసతిగృహాల సలహా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వసతిగృహాల్లో జరిగే కార్యక్రమాలపై తనకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల సలహా కమిటీ సమావేశం బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం తాను మాత్రమే ప్రజాప్రతినిధిగా ఉన్నానని, కానీ, తనకే ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ప్రకారం తనకు అధికారుల సమాచారం ఇవ్వడం లేదన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, ఎంఈవోలు బుచ్యానాయక్, తారాసింగ్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల డివిజన్ అధికారులు, వసతిగృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

# 'బౌ'బోయ్.. లెక్కలతోనే సరి!

(5వ పేజీ తరువాయి)

గాయపరుస్తుంటే వాటిని అరికట్టాల్సిన వారు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కుక్కల సంఖ్యను లెక్కించి కాగితాలకే పరిమితం చేశారు. కానీ వాటికి కు.ని. ఆపరేషన్లు చేయించలేకపోయారు. ఒక కుక్కను పట్టి ఆపరేషన్ చేయించాలంటే రూ.1500పైచిలుకు ఖర్చవుతుంది. గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేకపోవడంతో చాలా గ్రామాల్లో వెనక్కుతగ్గారు. నిరంతరం ఆదాయం వచ్చే మున్సిపాలిటీలు సైతం నిర్లక్ష్యం చూపాయి. దీంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా కుక్కలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా కుక్కల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు చేపడితే ప్రజలను ప్రాణహాని నుంచి పరిరక్షించే అవకాశం ఉంటుంది. హడావిడిగా వీధివీధి తిరుగుతూ తమతో కుక్కల సంఖ్యను లెక్కించారని, ఇప్పుడేమో కుక్కలను నియంత్రించకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.



కంగ్టి ఆస్పత్రిలో కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న జీవన్



**ఈ చోట్ల మాత్రమే**

నారాయణఖేడ్ పట్టణంలో ఇటీవల కాలంలో కుక్కకాట్లు లేవు. ఎందుకంటే గత ఏడాది పట్టణంలో 380 కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. 348 కుక్కలను ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. ఎప్పటికప్పుడు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోనూ 781 కుక్కలను గుర్తించి వాటికి పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స చేశారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 2వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. 1950 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఒక్కో కుక్కకు మున్సిపాలిటీ నుంచి రూ.1650 చొప్పున ఆపరేషన్ కోసం చెల్లించారు. గజ్వేల్ మున్సిపాలిటీలో 450 కుక్కలను గుర్తించి 401 కుక్కలకు ఆపరేషన్లు చేశారు. ఫలితంగా కుక్కకాట్లు నియంత్రణలోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో మిగతా చోట్ల కూడా ఇలా కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**ఊరూవాడ స్వైరవిహారం**

- చిన్నశంకరంపేట మండలంలో గడిచిన ఏడాదిలో 130 మంది కుక్కకాటుకు గురయ్యారు. గత నాలుగు రోజుల క్రితం ఇంటిముందు ఉన్న ఓ మహిళపై కుక్క దాడి చేసి గాయపరిచింది.
- కుకునూరుపల్లి మండలంలో ఆరు నెలల వ్యవధిలోనే 120 మందికి పైగా కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతీ రెండు రోజులకు ఒక సంఘటన మండలంలో వెలుగులోకి వస్తున్నది.
- బెజ్జంకి మండలంలో ఇటీవల 28 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.
- సదాశివపేటలోని రహమత్‌నగర్‌లో ఇటీవల కుక్కలు స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచాయి.
- చేగుంట మండలంలో ప్రస్తుత జూలై నెలలోనే 23 మంది కుక్కకాటుకు గురయ్యారు.
- మనోహరబాద్ మండలంలో గత జనవరి నుంచి ఇప్పటివరకు 175 మందిపై కుక్కలు దాడి చేశాయి.
- టేక్మాల్ మండలంలో గడిచిన 7 నెలల కాలంలో 252 మంది కుక్కకాటుకు గురై రేబిస్ టీకాలు తీసుకున్నారు.
- చిన్నకోడూరు మండలంలో జనవరి నుంచి పరిశీలిస్తే 286 మంది కుక్కకాటు బాధితులు ఉన్నారు.
- గత మార్చి 3వ తేదీన మెదక్ మండలం మక్త భూపతిపూర్‌లో ఆరుగురిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.
- దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్‌లో ఆడుకుంటున్న ఇద్దరు పిల్లలపై కుక్కలు పాశవికంగా దాడి చేశాయి.
- చేర్యాల పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికే పలువురిని గాయపరిచినా మున్సిపాలిటీ నుంచి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- అల్లాదుర్గంలో లౌక్య అనే మూడేళ్ల చిన్నారిపై రెండు నెలల క్రితం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చగా సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.
- తొగుట మండలం వెంకట్రావుపేటకు చెందిన ఒక వ్యక్తిపై ఈనెల 14వ తేదీన కుక్కలు దాడి చేశాయి. అయినా వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామానికి చెందిన మహేశ్‌పై ఈనెల 10వ తేదీన వెంటాడి మరీ కుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గడిచిన ఏడు నెలల కాలంలోనే 225 మంది కుక్కకాటుకు గురయ్యారు.



సదాశివపేట పట్టణం రెహమత్‌నగర్‌లో కుక్కకాటుతో చికిత్స పొందుతున్న బాలుడు

- నిజాంపేట మండలంలోనూ కొద్ది రోజుల క్రితం ఓ బాలుడిని కుక్కలు గాయపర్చగా చికిత్స పొందుతూ చనిపోయాడు.
- రామాయంపేట బీసీ కాలనీలోనూ ఆర్నెళ్ల కిందట ఓ చిన్నారిపై కుక్కలు పాశవికంగా దాడి చేశాయి.
- నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీటిని అరికట్టడానికి కనీస చర్యలు లేవు.
- సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో ఆర్నెళ్ల వ్యవధిలోనే సుమారు వంద మంది కుక్కకాటుకు గురయ్యారు. ఒక పుల్లూరు గ్రామంలో మాత్రం 30 కుక్కలను పట్టుకున్నారు.
- మిరుదొడ్డి మండలంలో ఇటీవల 18 మంది కుక్కకాటుకు గురయ్యారు. మిరుదొడ్డి, భూంపల్లి మండలాల్లో 700 కుక్కలు ఉన్నాయని లెక్కలు మాత్రమే వేశారు. కానీ చర్యలు చేపట్టలేదు.
- అమీన్‌పూర్ మున్సిపాలిటీలో 1800 వీధికుక్కలను గుర్తించినప్పటికీ కేవలం 335 కుక్కలకే సర్జరీ చేశారు. దీంతో కుక్కల భయం తొలగిపోలేదు.

## కార్మికులపై వేధింపులు మానుకోవాలి

● బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్

గజ్వేల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై రాణే మద్రాసు లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం వేధింపులు మానుకోవాలని బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీఎంఎస్ 71వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఎంఎస్ వ్యవస్థాపకుడు దంతోపాంట్ టెన్డీజీ చిత్రపటానికి పూలమాల వేసి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో కార్మిక రంగాల్లో సేవలు చేస్తూ కార్మికుల పక్షాన నిలబడి కార్మికుల హక్కులు కాపాడుతూ కార్మికుల మన్ననలు పొందిన జాతీయ కార్మిక సంఘాల్లో బీఎంఎస్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అనేక పరిశ్రమల్లో మెరుగైన వేతన ఒప్పందం బీఎంఎస్ ద్వారానే జరిగిందన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని రాణే మద్రాస్ లిమిటెడ్ పరిశ్రమలో సీఐటీయూ నాయకులు సమస్యలు గాలికి వదిలి యాజమాన్యంతో కుమ్మక్కై కొంతమంది కార్మికులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. అంతేకాకుండా యాజమాన్యంతో బెదిరింపులకు గురిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. సీఐటీయూ నాయకులు కార్మికుల మధ్య విభేదాలు సృష్టిస్తూ కార్మికులపై కార్మికులే యాజమాన్యానికి బలవంతంగా ఫిర్యాదులు చేపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## ప్రజ్ఞాపూర్ సమస్యలను పరిష్కరించండి

గజ్వేల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత ప్రజ్ఞాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు మోహన్నగారి రాజు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, కోతుల, కుక్కల బెడద, వర్షం నీటి సమస్య, పలు చోట్ల ఛంబర్లు పగిలిపోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి వెంట నాయకులు గుండు లక్ష్మణ్, ఈదుగాని శివులు, ఊడెం సారిక, భూమని ప్రశాంత్, పెర్క నాగరాజు తదితరులున్నారు.

## పీఆర్‌సీ కోసం తహసీల్దారుకు వినతి

చేర్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ ప్రకటించి 317జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయసంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల తహసీల్దారు దిలీప్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. 2023 నుంచి పీఆర్‌సీ ప్రకటించాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. 5571 ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు ప్రకటించి డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ వర్తింపచేయాలని కోరారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు, 40మంది కన్నా ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో 5మంది ఉపాధ్యాయులను నియమించి బలోపేతం చేయాలని కోరారు.

## రావురూకుల గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం



కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న అధికారులు, గ్రామస్థులు

సిద్దిపేట రూరల్,జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సర్వేలో భాగంగా బుధవారం సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామాన్ని కేంద్ర బృందం సభ్యులు దీప్తి, శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో డంపింగ్ యార్డులో కంపోస్టు ఎరువుల తయారీ, నివాసాల్లో మరుగుదొడ్ల వినియోగం, తడి, పొడి చెత్త నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాల వినియోగం, గ్రామంలోని మురికి కాలువలను, రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్లు సత్యనారాయణ, చెన్నారెడ్డి, మండల పంచాయితీ అధికారి విష్ణు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశవర్కర్లు తదితరులు ఎల్గొన్నారు.

## దేవాలయాల భూములను కాపాడాలి

అక్కన్నపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం, శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాలకు సంబంధించిన భూములను గ్రామానికి చెందిన గీకురు యాదగిరి అనే వ్యక్తి ఆక్రమించి అమ్ముకుంటున్నాడని స్థానిక పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావుకు బుధవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలకు సంబంధించిన భూములను యాదగిరి అనే వ్యక్తి ఆర్‌వోఆర్ పట్టా చేసుకొని అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. దేవాలయాల భూములను అమ్ముకుంటున్న యాదగిరి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకుని, ఆ భూములను కాపాడాలని వారు కోరారు. ఇందులో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎల్లప్పుడూ అప్రమత్తం



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

కొమురవెల్లి, జూలై23 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌ను బుధవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం సందర్శించి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు వస్తూ పోతుంటారని వాకిఇ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చేర్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, యాదగిరి పాల్గొన్నారు.

# ప్రహరీ లేక పరేషాన్



మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

మద్దూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏకంగా విద్యాకమిషన్ చైర్మన్ స్పందించి కళాశాలల బాల, బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ కట్టించినా.. ప్రహరీ లేకపోవడంతో సాయంత్రం అయిందంటే చాలు కళాశాల మద్యం ప్రియులకు అడ్డాగా మారుతోంది.

మండల కేంద్రంలో 2004లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. కో ఎడ్యూకేషన్ విధానంలో నడుస్తున్న ఈ కళాశాలలో 20 ఏళ్లుగా కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పలు పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి స్పందించారు. కళాశాలలోని సమస్యలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసరంగా కళాశాలలో బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్ అవసరం అని గుర్తించి వెంటనే రూ. 30 లక్షలు మంజూరు చేయించి వాటి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో మొత్తం రెండు సంవత్సరాలకు కలిసి 175 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, ఇప్పుడు కళాశాలకు కొత్త సమస్య వచ్చి పడింది. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కళాశాలకు కాంపౌండ్ వాల్ కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చి ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మద్దూరు జూనియర్ కళాశాలకు కంపౌండ్ వాల్ మంజూరు చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

### మద్యం ప్రియులకు అడ్డాగా..



కళాశాలకు కాంపౌండ్‌వాల్ లేకపోవడంతో మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. ఆకతాయిల మూలంగా కిటికీల అద్దాలు ధ్వంసం అవుతున్నాయి. కాంపౌండ్ వాల్ కడితే కళాశాలకు రక్షణతో పాటు పశువుల నుంచి హరితహారం మొక్కలకు రక్షణ ఉంటుంది.

-ఎన్. శ్రీనివాస్, కళాశాల అధ్యాపకుడు

### అదనపు గదులు కావాలి



కళాశాలలో రెండు సంవత్సరాలకు కలిపి సుమారు 170 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల కంపౌండ్ వాల్‌తో పాటు నాలుగు అదనపు తరగతి గదులు అవసరం. కళాశాలకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ కూడా ఇస్తే బాగుంటుంది.

-ఏ. అమరేందర్, కళాశాల అధ్యాపకుడు

## ప్రోటోకాల్ గురించి మాట్లాడే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు

● కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట జూలై 23 (ఆంధ్రజ్యోతి):ప్రోటోకాల్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రోటోకాల్ గురించి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ పథకాలపై అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేస్తే ప్రతిపక్ష నేత కేసీఆర్ రావడంలేదని, సిద్దిపేట జిల్లా అభివృద్ధిపై సమీక్ష పెడితే ఇక్కడికి కూడా రాడా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు కేసీఆర్ తన గజ్వేల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ ఎప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యాడని ఎద్దేవ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ నాయకులకు పట్టింపులేదని, వారు బబీఆర్‌ఎస్ పార్టీ ఉనికి కోసమే పని చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి బీఆర్‌ఎస్ పార్టీ ఓర్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిద్దిపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ పంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్ల పెండింగ్ వేతనాలు వేంటనే చెల్లించాలని ఆపరేటర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూస స్వామి కుమార్ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవోలకు ఈ పంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి కుమార్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ప్రభుత్వం ఆపరేటర్లకు రూ.22,750లకు బదులుగా రూ.19,500లు వేతనం తగ్గించి ఖాతాలో జమ చేస్తూ ఆపరేటర్లకు అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ప్రభుత్వం ఉద్యోగ బద్రత కానీ, సౌకర్యాలు కల్పించలేదన్నారు. గత పది సంవత్సారాలుగా ఎదురు చూస్తున్న హెచ్‌ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

గజ్వేల్ , జూలై 23(ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం గౌరారం శివార్లలో రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పెద్దపల్లికి వెళ్తున్న వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోదావరిఖనికి చెందిన సుధారాణికి తలకు గాయం అవగా, ప్రసాద్‌రాజ్‌కు ఛాతిలో, రాఘవేందర్‌కు నోటిపై, పెద్దపల్లికి చెందిన గురువారెడ్డికి చేతికి గాయాలయ్యాయి. వారిని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించి చికిత్సను అందించారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు గౌరారం పోలీసులు తెలిపారు.

### నిరుపేద కుటుంబానికి సాయం

దుబ్బాక, జూలై23;(ఆంధ్రజ్యోతి): ఇటీవల పాముకాటుతో మృతి చెందిన దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ వార్డుకు చెందిన యువరైతు కంకనాల రవి కుటుంబానికి గ్రామప్రజలు ఇతోదికంగా ఆర్థిక సహాయం అందించారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కంకనాల చందుముదిరాజ్ ఆధ్వర్యంలో 5వేల రూపాయాలను అందించారు.

# ఓట్ల కోసం వచ్చే వారిని నిలదీయాలి

● గజ్వేల్ సమస్యలను పరిష్కరించని కేసీఆర్

● సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసం వచ్చే బీఆర్‌ఎస్ నేతలను నిలదీయాలని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ అభివృద్ధి పేరిట కేసీఆర్ కుటుంబం వందల కోట్ల రూపాయలను దోచుకుందని ఆరోపించారు. కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చారని, యూజీడీ, రింగ్‌రోడ్డు, సీసీ రోడ్లు, బస్టాండ్, అంతర్గత రోడ్ల అభివృద్ధి అసంపూర్తి దశలోనే ఉన్నాయన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండకుండా కేబినేట్ హోదాతో వసతులను పొందుతున్నారని మండిపడ్డారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలను నట్టేట ముంచారన్నారు. మల్లన్నసాగర్ భూనిర్వాసితుల పక్షాన ఫాంహౌజ్ వీడి రావాలని, ఆయన అడిగితే నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. గజ్వేల్‌లో వచ్చే ఎన్నికల్లో అంతా సమన్వయంతో పనిచేసి మునిసిపాలిటీపై, స్థానిక సంస్థల్లో విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

### అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు సీఎం రేవంత్‌రెడ్డి గజ్వేల్‌లో పర్యటిస్తారని తెలిపారు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, మల్లన్నసాగర్ ముంపు గ్రామాల సమస్యలను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

సిద్దిపేట అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతంగా పూర్తయిందని విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు అభిషేక్, ప్రధాన కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ , ఏఐపీఎస్యు నాయకుడు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని చెప్పి తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు టాయిలెట్లు , మరుగుదొడ్లు దిక్కులేవన్నారు. పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఇంకా పూర్తిస్థాయిలో పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి దిక్కులేదని తక్షణమే నియమించాలన్నారు. అదే విధంగా ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించి, నిధులు కేటాయించాలని కోరారు. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని, విద్యార్థులందరికి ఉచిత బస్ పాసులు ఇవ్వాలని, నూతన జాతీయ విద్యా విధానాన్నీ తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బందులో స్వచ్ఛందంగా భాగస్వామ్యమైన విద్యార్థులకు వివిధ విద్యా సంస్థల యాజమాన్యాలకు విప్లవ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



విద్యార్థులకు అభినందన పత్రాలను అందజేసిన ప్రొఫెసర్

గజ్వేల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. భవాని, డి. సుజాత అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో 200 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన సందర్భంగా బస్‌డిపో మేనేజర్ పావన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతపై అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు అభినందన పత్రాలతో పాటు బహుమతులతో సత్కరించారు. ప్రతిరోజు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను గుర్తించి సత్కరించారు. వారు మాట్లాడుతూ మహిళా పథకం ద్వారా మహిళలకు ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, మార్కెట్ ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు.

## ముసురేసింది

(5వ పేజీ తరువాయి)

దౌల్తాబాద్‌లో 35.8, బెజ్జంకి 35.5, దుబ్బాక 32.5, హుస్నాబాద్ 30.8, గజ్వేల్ 30.5, సిద్దిపేట అర్బన్ 20.5, అక్కన్నపేట 28.3, మర్కూక్ 18.5, ధూలిమిట్ట 17.0, మిరుదొడ్డి 16.8, వర్గల్ 16.5, నంగునూరు 15.0, మద్దూరు 13.8, ములుగు 13.3, కోహెడ 12.5, చేర్యాల 12.0, తొగుట 9.3, జగదేవ్‌పూర్ 6.8, కొండపాక 6.3, కుకునూర్‌పల్లి 5.5, కొమురవెల్లి 3.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### 24 గంటలు అందుబాటులో మాన్సూన్ టీం

వర్షాకాలం సందర్భంగా సిద్దిపేట పట్టణంలో 24 గంటల పాటు మాన్సూన్ టీం అందుబాటులో ఉంటుందని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేటలోని పలు వార్డుల్లో అధికారులతో కలిసి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పర్యటించి. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడ నీరు నిలిచిపోకుండా చూడాలని సూచించారు. వార్డు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలని టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఆదేశించారు. అలాగే కార్మికుల భద్రత మన బాధ్యత అని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 9505507248కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.

-సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

న్యూస్ బాక్స్

### డ్రంకెన్ డ్రైవ్‌లో 21మందికి జరిమానా

గజ్వేల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి జరిమానా విధించారు. గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుపగా, 21 మంది వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి 21మందికి రూ.32,500 జరిమానా విధిస్తూ విధిస్తూ తీర్పును వెలువరించారని సీఐ మురళీ తెలిపారు.

### మంచి మెళుకువలతో బోధన

సిద్దిపేట రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ విద్యార్థులకు బోధనలో మంచి మెళుకువలతో బోధించాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసా చారి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని తరగతి గద బోధన, టీచింగ్ డైరీ, ఉపాధ్యాయుల బోధన, టీచింగ్ ప్లాన్స్, వొకేషనల్ ల్యాబ్స్ సందర్శించి ఖాన్ అకాడమి, ఫిజిక్స్ వాలా డిజిటల్ తరగతుల తీరు, మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్, ఎఎంఒ రవికుమార్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

### చక్కని చేతిరాత అందరికీ సాధ్యమే

మర్కుక్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరికీ అందమైన చేతిరాతను అందించడానికి మర్కుక్ మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల వరదరాజపూర్‌లో ప్రముఖ చేతిరాత మోటివేషనల్ స్పీకర ఆజాద్ అహ్మద్, చేత ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. దీనికి స్థానిక మండల విద్యాధికారి శ్రీ వెంకటరాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల అందమైన చేతిరాతను బాల్య దశ నుండే అలవర్చుకున్నట్లయితే వారు పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవమే కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంలో మంచి ఉన్నత స్థితిలోకి ఎదుగుతారని అన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో గోరింటాకు వేడుకలు

చేర్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రం-11లో బుధవారం గోరింటాకు సంబరాలను ఘనంగా జరిపారు. ఈసందర్భంగా చిన్నారులు, వారి తల్లులు, గోరింట పెట్టుకుని ఆనందోత్సాహాలు వెల్లబుచ్చారు.

### దండోరా నేత కన్నుమూత

దుబ్బాక, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాలతో మమేకమై, పలు విప్లవోద్యమాలల్లో పనిచేసి, మాదిగదండోరా అవిర్భావం నుంచి దుబ్బాక నియోజక వర్గంలో కీలకంగా పనిచేసిన దండోరా మల్లేశం(జనగామ మల్లేశం) బుధవారం గుండెపోటుతో మరణించారు. దుబ్బాక మున్సిపల్ దర్మాజీపేట వార్డుకు చెందిన మల్లేశం పలు ప్రజా ఉద్యమాలల్లో కీలకంగా పని చేశారు. ఆయన విప్లవోద్యమాలల్లో, దండోరా ఉద్యమంలో జైలు జీవితం కూడా అనుభవించారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, దండోరా నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

### బీఆర్‌ఎస్ విజయం ఖాయం

గజ్వేల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని నాచారం దేవస్థానం మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ తగ్గిపోతుందని, ప్రజలంతా ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### ఉచిత వైద్యశిబిరం

మిరుదొడ్డి, జూలై23 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 26న అఖిలరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆఫౌండేషన్ ప్రతినిధి అస్కస్వామి అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో అఖిలరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిర వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో అఖిలరాజ్ ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

### విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ములుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువు కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం చేయడానికి అయినా సిద్దంగా ఉన్నామని ఇంటర్నేషనల్ 3150 జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్వి రాంప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ములుగులోని కేఎంఆర్ గార్డెన్స్‌లో హెల్ప్ టు నీడ్ అనుబంధంగా రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.



# యూరియాను అక్రమంగా తరలిస్తే చర్యలు..



రాయపోల్‌లో ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఎస్సై మానస, ఏవో నరేష్

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం ఫర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయ, పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియాను రైతులు వ్యవసాయ పొలాలకు తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించిన చట్టపరమైన చర్యలు తప్పవని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. :రైతులకు ఎరువుల కొరత సృష్టించేందుకు అక్రమంగా యూరియాను నిల్వచేస్తే కఠిన చర్యలు తప్పవని మిరుదొడ్డి మండల వ్యవసాయాధికారి మల్లేశం హెచ్చరించారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఉన్న యూరియాను యజమానులు విధిగా స్టాక్ బోర్డుపై నమోదు చేయాలని రాయపోల్ ఎస్సై మానస, మండల వ్యవసాయ అధికారి నరేష్ పేర్కొన్నారు. వ్యవసాయానికి వాడాల్సిన యూరియా ఇతర పరిశ్రమలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు వ్యవసాయ అధికారి ప్రగతి, ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గజ్వేల్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లోని అల్‌హక్ ఎడ్యుకేషనల్ సొసైటీ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి సీఐ వెంకటేశం హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులు సమ్మేళన కార్యక్రమాలు చేసుకోవడం అభినందనీయమన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు